సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 19 । జనవరి । 2023



వైభవంగా ఏకాదశి వేడుకలు

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఏకాదశి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. దాదాపు 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.



బ్రోచర్ ఆవిష్కరణ

శాతవాహనయూనివర్సిటీ: ఎస్‌యూలో ఫిబ్రవరి 27, 28 తేదీల్లో జరిగే జాతీయ కాన్ఫరెన్స్ బ్రోచర్‌ను వీసీ మల్లేశం బుధవారం ఆవిష్కరించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/17.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కంటివెలుగుకు సర్వం సిద్ధం



సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం మాట్లాడారు. కంటి వెలుగుకు ఏర్పాట్లు పూర్తి చేశామని, ఇప్పటికే 26 కేంద్రాలలో డ్రై రన్ నిర్వహించామన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తామని తెలిపారు. 26 మంది వైద్యాధికారులు, 26 ఆప్టోమెట్రిక్ టెక్నీషియన్స్, 26 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆటోరిఫ్రాక్టర్ మిషన్స్, వాహనాలను సమకూర్చామన్నారు. కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి శ్రీరాములు, స్టేట్ అధికారి నందిత, డీపీఆర్వో మామిండ్ల దశరథం పాల్గొన్నారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి



కోనరావుపేట(వేములవాడ): మామిడిపల్లిలో జరిగే మాఘమాస్య జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని డీఎస్పీ నాగేంద్రాచారి కోరారు. మామిడిపల్లిలో ఈనెల 21 నుంచి జరిగే జాతర ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ జాతరకు జిల్లాలోని అన్ని ప్రాంతాలతోపాటు నిజామాబాద్ జిల్లా సిరికొండ, భీమ్‌గల్ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు నిర్వహిస్తామన్నారు. సర్పంచ్ కొక్కుల భారత, సీఐ కిరణ్‌కుమార్, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఎల్లాల రాంరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కమలాకర్, అర్చకులు తిరునహరి కృష్ణహరి, లక్ష్మణస్వామి ఉన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డేటాప్రో కంప్యూటర్స్ ద్వారా ఉపాధినిచ్చే పలు కోర్సుల్లో నిరుద్యోగ మైనార్టీ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. అకౌంట్స్ అసిస్టెంట్ యూజింగ్ ట్యాలీ, హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్ కోర్సులలో శిక్షణకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 35 ఏళ్ల వయస్సు గల క్రైస్తవేతర మైనార్టీ యువతీయువకులు ఆధార్‌కార్డు, రూ.2లక్షలలోపు వార్షిక ఆదాయ సర్టిఫికెట్‌తో ఈనెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సిరిసిల్ల: జిల్లాలో యాసంగి సీజన్‌లో రైతులు వరిపంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి రణధీర్‌రెడ్డి కోరారు. జిల్లాలో వరి నాట్లు తుది దశకు చేరుతున్నాయని, ఇప్పటికే నాట్లు వేసిన రైతులు నాటువేసిన 15 రోజులకు సల్ఫైడ్ గాయం ప్రభావం కనిపిస్తుందన్నారు. దీని నివారణకు చీమపగుళ్లు వచ్చే వరకు పొలాన్ని వారం నుంచి పది రోజుల వరకు ఆరబెట్టాలని సూచించారు. మొగిపురుగు, ఆకుముడత పురుగును గమనిస్తే.. కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరానికి 8 కిలోలు లేదా కార్బోఫ్యూరాన్ (3జీ) గుళికలు ఎకరానికి 10 కిలోలు చల్లాలన్నారు.

సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో వార్డు కౌన్సిలర్ నీలం కల్యాణి శేఖర్ ఆధ్వర్యంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి బుధవారం భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ వేములవాడ ఏరియా ఆస్పత్రికొచ్చే ప్రజల కోసం రూ.12.50 లక్షలతో సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు, కౌన్సిలర్లు జోగిని శంకర్, కందుల శ్రీలత, క్రాంతి ఉన్నారు.

వెలుగులు నింపేలా..

- నేటి నుంచి జిల్లాలో కంటి వెలుగు
- 26 వైద్యబృందాలు.. నిత్యం 300 మందికి వైద్యపరీక్షలు
- జిల్లాలో 4,22,182 మందికి పరీక్షలు
- జిల్లాకు చేరిన 24,040 కళ్లజోళ్లు
- పదిహేను రోజుల్లోగా స్పెషల్ అద్దాలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు (ఫైల్)



సిరిసిల్లటౌన్: కంటి జబ్బులతో బాధపడుతున్న వారిలో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి 'కంటి వెలుగు'కు శ్రీకారం చుట్టింది. పద్దెనిమిదేళ్లు పైబడిన వారికి కంటిపరీక్షలు చేసి, చూపు సమస్యలు ఉన్న వారికి ఉచితంగా వైద్యసేవలు అందించాలని నిర్ణయించారు.

అందరికీ కంటి పరీక్షలు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 26 వైద్యబృందాలుగా అన్ని గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో గడపగడపకూ వెళ్లి పరీక్షలు నిర్వహించేలా సన్నాహాలు చేశారు. ఒక్కో బృందంలో ఒక వైద్యుడు, ఆప్టోమెట్రిక్ టెక్నీషియన్ ఒకరు, డాటా ఎంట్రీ ఆపరేటర్ ఒకరు, సూపర్‌వైజర్ ఒకరు, ఏఎస్ఎంలు ఇద్దరు, ఆశకార్యకర్తలు ముగ్గురిని నియమించారు. వీరు ప్రణాళికా ప్రకారం గ్రామాలు పట్టణాల్లో అయితే వార్డులో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సోమవారం నుంచి శుక్రవారం వరకు కంటిపరీక్షలు నిర్వహిస్తారు. మొత్తంగా వంద రోజుల్లో జిల్లావ్యాప్తంగా నిర్ణీత లక్ష్యాన్ని చేరుకునేలా కలెక్టర్ అనురాగ్ జయంతి నేతృత్వంలో వైద్యారోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 19న ఉదయం 9 గంటలకు జిల్లావ్యాప్తంగా 26 క్యాంపులతో కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ క్యాంపులు తంగళ్లపల్లి, నేరెళ్ల, చీర్లవంచ, ఇల్లంతకుంట, ఆరెపల్లి, కొదురుపాక, విలాసాగర్, బోయినపల్లి, అనుపురం, హన్మాజీపేట, చందుర్తి, నిమ్మపల్లి, కోనరావుపేట, గంభీరావుపేట, లింగన్నపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, హరిదాస్‌నగర్, ముస్తాబాద్, గూడెంతోపాటు వేములవాడలో 10, 20వ వార్డులు, సిరిసిల్లలో 10, 25, 35వ వార్డులలో క్యాంపులు నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద రద్దీని నివారించేందుకు వీలుగా ముందుగానే ఇంటింటికీ టోకెన్లను అందజేస్తారు. అందరికీ కంటిపరీక్షలు చేసిన తర్వాత అవసరమైన వారికి మందులు, వైద్యసలహాలతోపాటు అదే రోజున కంటి అద్దాలు ఉచితంగా అందజేస్తారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోజుకు 300 మందికి కంటిపరీక్షలు నిర్వహిస్తారు.

4,22,182 మందికి కంటిపరీక్షలు

జిల్లావ్యాప్తంగా 18 ఏళ్ల పైబడిన వారు 4,22,182 మందికి పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈమేరకు కలెక్టర్ అనురాగ్ జయంతి నేతృత్వంలో డ్రైరన్స్ పూర్తి చేశారు. క్యాంపుల్లో కంటి చికిత్స అందించే సిబ్బందికి శిక్షణనిచ్చారు. క్యాంపులకు కావాల్సిన సామగ్రి, ఆటోరిఫ్రాక్టర్ మిషన్, రీడింగ్ కళ్ల అద్దాలు ఈఈసీ మెటీరియల్, జిల్లాకు చేరుకుంది. క్యాంపులో ప్రజలు మొదట టేబుల్ 1 వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకొని కంటివెలుగు కార్డు తీసుకోవాలి. రెండో టేబుల్ వద్ద దగ్గర, దూరపు చూపు పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం మూడో టేబుల్ వద్ద మెడికల్ ఆఫీసర్ కంటిని పరీక్షించి మోతెబిందు, మెల్లకన్ను కంటిపై పొర రావడం వంటి సమస్యలను పరిశీలించి చెబుతారు. గతంలో ఏదైన ఆపరేషన్లు జరిగితే వివరాలను వైద్యులకు చెప్పాల్సి ఉంటుంది. అన్ని విధాల పరీక్షల చేసిన తర్వాత మెడికల్ ఆఫీసర్లు టేబుల్ నంబర్ 4 వద్దకు పంపిస్తారు. అక్కడ ఆప్టోమెట్రిస్ట్ టెక్నీషియన్ ఆటో రిఫ్రాక్టర్ మిషన్ ద్వారా రిఫ్రాక్టివ్ ఎర్రర్ కోసం పరీక్షలు చేసి బెస్ట్ కరెక్టెడ్ విజువల్ యాక్టివిటీ పద్ధతి ద్వారా కంటిచూపు క్లియర్‌గా వచ్చే వరకు అద్దాలను మార్చుతూ రోగులకు పరీక్షలు చేస్తారు. ప్రజల కంటి చూపు వివరాలు పొందుపరుస్తూ 5వ నంబర్ టేబుల్ వద్దకు పంపిస్తారు. అక్కడ రీడింగ్ గ్లాసెస్‌తోపాటు దృష్టి లోపం +1, 1.5,+2,+2.5,+3 సైట్ గల అద్దాలను లబ్ధిదారులకు అందిస్తారు. ఎవరికైన ప్రత్యేకమైన అద్దాలు అవసరమైతే ఆ రిపోర్టును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, మ్యానుఫాక్చరింగ్ కంపెనీకి పంపించి 15 రోజుల్లోగా అందిస్తారు.

జిల్లాలో కంటివెలుగు లక్ష్యం

వైద్యబృందాలు :	26
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు :	23
అర్బన్ హెల్త్ సెంటర్లు :	03
జనాభా :	5.50 లక్షలు
జిల్లాకు చేరిన కంటి అద్దాలు :	24,040

ఆపరేషన్ చేసిండ్రు..మంచిగుంది



పోయిన కంటివెలుగులో నాకు ఆపరేషన్ చేసిండ్రు. కంటిలో పొరతో చూపు అస్సలు కనిపించలేదు. సర్కారు పెట్టిన శిబిరంలో డాక్టర్‌లు పరీక్షలు చేసి ఆపరేషన్ అన్నరు. సార్లు తీసుకుపోయి ఆపరేషన్ చేయించిండ్రు. ఇప్పుడు కంటి చూపు మంచిగా ఉంది.

– మల్యాల లచ్చవ్వ, రుద్రంగి

ప్రైవేట్‌లో ఆపరేషన్ చేయించుకున్న



నాకు ఎనిమిదేళ్లగా కంటిచూపు మందగించింది. దవాఖానాలు తిరుగుతున్న సమయంలో కంటివెలుగులో చూపించుకున్న. పరీక్షలు, మందులు ఇచ్చిండ్రు. ఆపరేషన్ అవసరం అన్నరు. కానీ చానా దినాలు వేచి చూసిన చేయలేదు. ఆపరేషన్లు చేయరని తెలిసి ప్రైవేటులో రూ.8వేలు పెట్టి చేయించుకున్న.

– దేశవేని నడిపి నర్సయ్య

సర్వం సన్నద్ధం



జిల్లాలో ప్రజలందరికీ కంటిపరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేశాం. కంటి సమస్యలు గుర్తించిన వారికి ఎప్పటికప్పుడు కళ్లజోళ్లు అందజేస్తాం. షెడ్యూల్ ప్రకారం పరీక్షలు చేయించుకున్న వారు మా టీమ్స్ వచ్చే సమయానికి ఇంట్లో ఉండాలి.

– సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

రోగులతో మర్యాదగా ప్రవర్తించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



చందుర్తి (వేములవాడ): కంటి సమస్యలు ఉన్న వారు కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. చందుర్తిలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని బుధవారం పరిశీలించి, అనంతరం స్థానిక పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో సమావేశమయ్యారు. ఆస్పత్రికొచ్చే రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులుండాలి



సిరిసిల్ల: జిల్లాలోని అన్ని వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక వసతులు బాగుండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో బుధవారం సమీక్షించారు. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్ వసతి గృహాలను, గురుకులాలను క్షేత్రస్థాయిలో ప్రత్యేకాధికారులు సందర్శించారని, ఆయా వసతి గృహాల్లో చేపట్టాల్సిన పనులపై శుక్రవారంలోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, టాయిలెట్లు, డార్మెట్రీలపై దృష్టి సారించి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని సూచించారు. డీఈవో రాధాకిషన్, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ అధికారి మోహన్‌రెడ్డి, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ ఈఈ విరూపాక్ష, మైనార్టీ కార్యాలయం ఓఎస్డీ సర్వర్‌మియా, గురుకులాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేస్తాం

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమరెడ్డి
- 26న పార్టీలో చేరనున్న లగిశెట్టి శ్రీనివాస్



సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమరెడ్డి

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్రం యావత్తు ఇటు వైపు చూసేలా సిరిసిల్లలో భారీ బహిరంగ సభను బీజేపీ నిర్వహిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సిరిసిల్ల అసెంబ్లీ పాలక్ రాణి రుద్రమరెడ్డి తెలిపారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడారు. పార్టీ ఆదేశాలతో సిరిసిల్లలో పనిచేస్తున్నానని, పార్టీ శ్రేణుల్లో ఐక్యతను పెంచుతున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు అభిప్రాయ విభేదాలు వీడి పార్టీ కోసం పనిచేయాలన్నారు. నియోజకవర్గంలోని 281 పోలింగ్ బూత్‌ల్లోనూ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తున్నామని, ఇప్పటికే 130 పోలింగ్ బూత్‌ల్లో పార్టీ శ్రేణులను నియమించామన్నారు. బూత్ కమిటీలతో నేరుగా మాట్లాడుతూ పార్టీని పటిష్టం చేస్తామని వివరించారు.

26న లగిశెట్టి శ్రీనివాస్ చేరిక

సిరిసిల్ల పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు, 'సెస్' మాజీ వైస్‌చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్ ఈనెల 26న బీజేపీలో చేరుతారని రాణిరుద్రమరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో పార్టీలో చేరిన తరువాత సిరిసిల్లలో భారీ బహిరంగ సభ ఉంటుందని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఎవరైన విజయం కోసం పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. కమలం గుర్తు ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లిందని, గతంలో ఇక్కడే పలుమార్లు పార్లమెంట్ సభ్యులు గెలిచిన చరిత్ర ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రెడ్డబోయిన గోపి, తదితరులు ఉన్నారు. అంతకు ముందు రాణిరుద్రమరెడ్డి తంగళ్లపల్లి, సిరిసిల్ల పట్టణంలో పార్టీ కార్యకర్తలతో వేరువేరుగా సమావేశాలు నిర్వహించారు.

బూత్‌కమిటీలను బలోపేతం చేయాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపొందేందుకు నియోజకవర్గంలోని అన్ని బూత్ కమిటీలు కీలకపాత్ర పోషించాలని పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ పాలక్ రాణి రుద్రమదేవి కోరారు. తంగళ్లపల్లి మండల స్థాయిలో శక్తికేంద్ర(బూత్ కమిటీల) ఇన్‌చార్జిలతో బుధవారం సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, కరీంనగర్ పార్లమెంట్ కోకన్వీనర్ ఆడెపు రవీందర్, అసెంబ్లీ కన్వీనర్ మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు సురువు వెంకట్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు కోల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రాజుయాదవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఖాశీచరణ్ ఉన్నారు.

ధాన్యం డబ్బులు పక్కదారి పట్టించారు

- చందుర్తిలో మహిళా రైతు నిరసన



నిరసన తెలుపుతున్న బుచ్చవ్వ

చందుర్తి (వేములవాడ): ధాన్యం డబ్బులు పక్కదారి పట్టించారని ఆరోపిస్తూ చందుర్తి సింగిల్‌విండో ఆఫీస్ ఎదుట బుధవారం మహిళా రైతు నిరసనకు దిగింది. మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన మహిళా రైతు కొమ్మనపల్లి బుచ్చవ్వ వానాకాలంలో పండించిన వరి ధాన్యం 43.60 క్వింటాళ్లను ఆశిరెడ్డిపల్లెలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించింది. ధాన్యం విక్రయించి నెల రోజులు గడుస్తున్నా డబ్బులు ఖాతాలో జమకాకపోవడంతో సింగిల్‌విండో కార్యాలయానికి బుధవారం వచ్చింది. ఆఫీస్ సిబ్బంది రిజిస్టర్‌లో పరిశీలించగా.. బుచ్చవ్వ విక్రయించిన ధాన్యం ఆశిరెడ్డిపల్లికి చెందిన నలుమాచు మమత పేరిట నమోదు చేసినట్లు ఉంది. దీంతో మహిళా రైతు బుచ్చవ్వ సింగిల్‌విండో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగింది. ఈ విషయం తెలుసుకున్న సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్ కొనుగోలు కేంద్రం నిర్వాహకునిని ప్రశ్నించగా దురుసుగా బదులిచ్చినట్లు తెలిసింది. దీంతో నిర్వాహకుడు అనిల్‌పై చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేస్తానని అధ్యక్షుడు శ్రీనివాస్ మహిళ రైతు బుచ్చమ్మకు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించింది. మహిళా రైతు బుచ్చవ్వ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు గుంటక అనిల్‌కు తన అల్లుడు పున్నాలు చిట్టీ డబ్బులు ఇవ్వాలనే మమత పేరిట ధాన్యం నమోదు చేశారని పేర్కొంది. మమత ఖాతాలో జమయిన ధాన్యం డబ్బులు రూ.89,816 అనిల్ తీసుకున్నాడని ఆరోపించింది.

పెచ్చులూడుతున్నాయి..

- భయం భయంగా బడికి
- శిథిలావస్థకు చేరిన 98 పాఠశాలలు
- 425 పాఠశాలల్లో మరమ్మతుకు ప్రతిపాదనలు
- పట్టించుకోని అధికారులు



ఈ ఫొటోలో పెచ్చులూడి కనిపిస్తున్న భవనం రాచర్ల బొప్పాపూర్ ప్రాథమిక పాఠశాల. తరగతులు నిర్వహిస్తుండగానే అనేక సార్లు పెచ్చులూడి పడ్డాయి. అదృష్టంకొద్ది ఆ సమయంలో గదిలో విద్యార్థులు లేకపోవడంతో ఎవరూ గాయపడలేదు. ఈ పాఠశాలలో ఐదు గదులు ఉండగా రెండు శిథిలావస్థకు చేరాయి. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కూడా పెరగడంతో తరగతి గదులు సరిపడేలా లేవు. దీంతో శిథిలావస్థకు చేరిన ఓ గదిలో విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. కొన్నిసార్లు విద్యార్థులను ఆరుబయట కూర్చోబెట్టి విద్యాభ్యాసం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనంలో విద్యార్థులు భయం భయంగా గడుపుతున్నారు. తల్లిదండ్రులు అనేకసార్లు జిల్లా విద్యాధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు.



ఎల్లారెడ్డిపేటలో ఆరుబయటే విద్యాబోధన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మన ఊరు–మన బడిలో అనేక పనులు చేపడుతుంది. అయితే ఈ పథకం కొన్ని పాఠశాలలకే పరిమితం కావడంతో మిగతా స్కూళ్లలో వసతుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో అధిక సంఖ్యలో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. పైకప్పులు పెచ్చులూడిపోతుండడంతో తరగతిగదుల్లో విద్యార్థులు భయం.. భయంగానే కూర్చుంటున్నారు. చిరుజల్లులకే ఉరుస్తుండడంతో తడుస్తూ పాఠాలు వింటున్నారు. ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యనందిస్తామన్న ప్రభుత్వం కనీసం నూతన భవనాలు నిర్మించకపోవడం దారుణం.

జిల్లాలో 511 పాఠశాలలు

జిల్లాలో 511 ప్రభుత్వ పాఠశాలలకు 98 స్కూళ్లలోని తరగతి గదులు పెచ్చులూడిపోయాయి. జిల్లావ్యాప్తంగా పాత వాటి స్థానంలో 428 తరగతి గదులు నిర్మించాల్సిన అవసరముందని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పాఠశాలల పాత భవనాలను కూల్చివేయడంలో ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతోంది. నిబంధనల సాకుతో ఒక్కో శాఖకు సంబంధం లేకుండా దాటవేస్తోంది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, సింగారం, అగ్రహారం, వెంకటాపూర్, రాగట్లపల్లి, కిష్టంపల్లి, వీర్నపల్లి మండలం గర్జనపల్లి ప్రభుత్వ పాఠశాలల పాతభవనాలను కూల్చివేయకపోవడంతో విద్యార్థులు భయం.. భయంగానే తరగతిగదుల్లో కూర్చుంటున్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులను ఆరుబయట కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు.

మధ్యాహ్న భోజనానికీ ఇబ్బందులే..

ఎల్లారెడ్డిపేట మండలంలో ఇటీవల మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించి విద్యార్థులు అస్వస్థతకు గురవడం, పురుగుల అన్నం, నీళ్ల చారుతో రోడ్డెక్కి ఆందోళన చేయడం చూశాం. సదరు పాఠశాలల్లో ఇప్పటికీ వంట తయారీలో మార్పు రాలేదు. గురుకులం, కస్తూర్బా, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాల్సిన మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఇలాంటి సమస్యలు పునరావృతమవుతున్నాయి. జిల్లాలో మధ్యాహ్న భోజనం వండిపెట్టడానికి 196 పాఠశాలల్లో సరైన గదులు లేవు.

పాఠశాలలు	511
విద్యార్థులు	44,748
అవసరమున్న క్లాస్‌రూమ్స్	428
నిర్మాణంలో ఉన్నవి	115
మరమ్మతు చేయాల్సినవి	396
ప్రహరీలు లేని స్కూల్స్	93
శిథిలావస్థలో ఉన్నవి	98

భయంగా ఉంది



పాఠశాలలకు పిల్లలను పంపాలంటే భయంగా ఉంది. శిథిలావస్థలో ఉన్న తరగతి గదుల్లో విద్యాబోధన చేస్తున్నారు. బొప్పాపూర్ ప్రాథమిక పాఠశాలలో భవనం పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయి. విద్యార్థులు గాయాలవుతాయోనని ఆందోళగా ఉంది. ఈ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు.

– జనగంటి రమేశ్, గొల్లపల్లి

ప్రభుత్వానికి పట్టింపు లేదు..



ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వానికి పట్టింపు లేదు. ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలలను పరిశీలిస్తే వసతులు అధ్వానంగా ఉన్నాయి. అనేక పాఠశాలల్లో భవనాలు శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడి పోయి విద్యార్థులపై పడుతుండడంతో గాయపడుతున్నారు.

– మారవేణి రంజిత్‌కుమార్, ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్

జాగ్రత్తలు తీసుకుంటున్నాం



ప్రమాదకరంగా ఉన్న పాఠశాలల్లో విద్యార్థులను వరండాల్లో కూర్చోబెట్టి విద్యాభ్యాసం చేస్తున్నాం. పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న పాఠశాలల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం. పాఠశాలల పరిస్థితిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. కొన్ని పాఠశాలల్లో మరమ్మతులు కూడా చేపట్టాం.

– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

క్లుప్తంగా

ఇద్దరిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసును పోలీసులు బుధవారం నమోదు చేశారు. ఏఎస్సై కిషన్‌రావు తెలిపిన వివరాలు. మండలకేంద్రంలోని దుమాల ఎక్స్‌రోడ్‌లో వాహన తనిఖీలు చేపట్టగా ఇద్దరు మద్యం సేవించి వాహనాలను నడుపుతుండగా పట్టుకున్నామన్నారు. జరిమానా విధించడమే కాకుండా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు ?

చందుర్తి(వేములవాడ): చందుర్తి పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడి నుంచి బైక్ స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆర్సీని తీసుకురావాలని సూచించినట్లు తెలిసింది. వాహనాదారున్ని ఒరిజనల్ ఆర్సీ తీసుకొచ్చి బైక్ తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. ఇటీవల చందుర్తి మండలకేంద్రానికి చెందిన ఓ యువకుని బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లగా.. సదరు యువకుడు పోలీసుల తీరును నిరసిస్తూ వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. దీన్ని సవాల్‌గా తీసుకున్న పోలీసులు మండలంలో తిరుగుతున్న బైక్‌లపై దృష్టి పెట్టినట్లు తెలిసింది. చందుర్తితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో తప్పుడు నంబర్లతో 20కి పైగా బైక్‌లు ఉన్నట్లు ప్రచారం కావడంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు.

డబ్బుల వివాదం.. వ్యక్తి కిడ్నాప్

మెట్‌పల్లి(కోరుట్ల): డబ్బుల వివాదంలో ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన సంఘటన మెట్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెట్‌పల్లిలోని ఇందిరానగర్‌కు చెందిన కోట రాజయ్యకు అదే కాలనీకి చెందిన ద్యావనమైన ఎల్లమ్మ కుటుంబానికి మధ్య డబ్బుల విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత మంగళవారం ఎల్లమ్మ.. సమ్మయ్య, కోట దుర్గయ్య, ఇస్తారిలతో కలిసి రాజయ్య ఇంటికి వెళ్లింది. అందరూ కలిసి రాజయ్య, అతని భార్య రామక్కలపై దాడి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా ఇంట్లోని వస్తువులు ధ్వంసం చేశారు. అనంతరం రాజయ్యను బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించుకొని, వెళ్లిపోయారు. తన భర్తను ఎక్కడికో తీసుకుపోయారని రామక్క బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ పేర్కొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తేవాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): టీడీపీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆవునూరి దయాకర్‌రావు కోరారు. ఎల్లారెడ్డిపేటలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సూర్యం, రాష్ట్ర నాయకులు శేఖర్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు నారాయణగౌడ్, నాయకులు ప్రహ్లాద్, ప్రశాంత్, మల్లారెడ్డి, దాసు, రాములునాయక్, బాలయ్య, సల్మాన్ పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

మేడిపెల్లి(జగిత్యాల): జీవితంపై విరక్తితో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై రవీందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. బీమారం మండలంలోని గోవిందారం గ్రామానికి చెందిన దండికం మల్లయ్య(64) భార్య కొన్ని రోజుల క్రితం చనిపోయింది. దీంతో ఆయన మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఒంటరితనంతో జీవితంపై విరక్తి చెంది, మంగళవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడికి ఒక కుమారుడు, కూతురు కాగా ఇద్దరికీ వివాహాలయ్యాయి. కొడుకు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. మృతుడి కూతురు గడ్డి లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం.. ఇక రుచికరం



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

- భోజన పథకంలో స్లాబ్ ధరలు పెంచిన సర్కారు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2,03,004 మంది విద్యార్థులకు ప్రయోజనం

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇకనుంచి రుచికర భోజనం అందనుంది. ప్రస్తుతం అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో స్లాబ్ ధరలు పెంచుతూ ప్రభుత్వం ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్‌లో పెరిగిన నిత్యావసరాల ధరల కారణంగా వంట నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించలేక పోతున్నారు. రోజురోజుకూ రేట్లు అధికమవుతుండటంతో భోజనం తయారీపై వంట ఏజెన్సీలు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతోంది. ఈ విషయాన్ని గ్రహించిన సర్కారు ధరలు పెంచింది. మధ్యాహ్న భోజనం తయారీకి అవసరమైన సన్న బియ్యాన్ని ప్రభుత్వమే సరఫరా చేస్తోంది. కూరగాయలు, కోడిగుడ్లను మాత్రం వంట ఏజెన్సీల నిర్వాహకులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మెనూ ప్రకారం పాఠశాలలు పనిచేసే వారానికి ఆరు రోజుల్లో మూడు రోజులపాటు గుడ్డు ఇవ్వాల్సి ఉంటుంది. రోజు పప్పు, ఒక కూర తప్పనిసరిగా ఉండాలి. గుడ్డు ధర పెరగడం నిర్వాహకులకు భారంగా మారింది. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో మధ్యాహ్న భోజన పథకం పటిష్టం కానుంది. పోషకాలతో కూడిన రుచికర భోజనం విద్యార్థులకు అందనుంది.

అక్టోబరు 2022 నుంచి అమలు..

మధ్యాహ్న భోజన పథకం ధరలు పెంచుతూ ఈ నెల 12న ఉత్తర్వులు జారీ అయినప్పటికీ 2022 అక్టోబర్ 1 నుంచి వాటిని అమలు చేయాలని ప్రభుత్వం పేర్కొంది. వంట ఏజెన్సీలు అక్టోబర్, నవంబరు, డిసెంబర్ నెలలకు సంబంధించిన బిల్లులు గతంలోనే సమర్పించినప్పటికీ.. పెంచిన ధరల ప్రకారం మళ్లీ అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న 2,03,004 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

ఉమ్మడి జిల్లాలో పాఠశాలలు, విద్యార్థులు, కుకింగ్ కం హెల్పర్లు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	హెల్పర్లు
కరీంనగర్	662	49,754	1,134
జగిత్యాల	781	71,909	1,564
పెద్దపల్లి	545	38,428	1,123
రాజన్నసిరిసిల్ల	496	42,913	863

పెరిగిన ధరలు (ఒక్కో విద్యార్థికి రూ.లలో)...

తరగతి	గతంలో	ప్రస్తుతం
1–5	4.97	5.46
6–8	7.45	8.17
9–10	9.95	10.67

ఉత్తర్వులు అందాయి



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో భాగంగా ధరలు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అందాయి. వంట ఏజెన్సీలు మెనూ ప్రకారం భోజనం అందించాలి. ధరల పెంపుతో విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందుతుంది. భోజనం తయారీలో నాణ్యతను నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.

– సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, డీఈవో, కరీంనగర్

భక్తిశ్రద్ధలతో మార్కండేయ సప్తాహం



శివాలయంలో నిర్వహించిన మార్కండేయ యాగం

సిరిసిల్లకల్చరల్: శివభక్త శ్రీమార్కండేయ మహాస్వామి జయంతి సందర్భంగా పట్టణ పద్మశాలీ సంఘం సారథ్యంలో మార్కండేయ సప్తాహం బుధవారం ప్రారంభమైంది. శివనగర్ శ్రీరాజరాజేశ్వర దేవాలయంలో నిర్వహించిన మార్కండేయ మహాయాగం భక్తిశ్రద్ధలతో సాగింది. ఈనెల 24న మార్కండేయ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో ప్రధాన ఆలయాల్లో రోజుకో చోట యాగాలు నిర్వహించేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈమేరకు శివాలయంలో జరిగిన యాగంలో సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, పద్మశాలీ సంఘం ప్రతినిధులు మండల సత్యం, గాజుల బాలయ్య, కట్టెకోల లక్ష్మీనారాయణ, రాపెల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ బంధు అమలు చేయాలి

- విశ్వకర్మ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ప్రవీణ్



హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్లఅర్బన్: విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా పోరాడితే ప్రభుత్వ ఫలాలను పొందవచ్చని విశ్వకర్మ కార్పెంటర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రేపోజు ప్రవీణ్‌చారి పేర్కొన్నారు. సిరిసిల్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సొసైటీ గౌరవాధ్యక్షుడు విశ్వనాథుల కిషన్ ఆధ్వర్యంలో కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ముందుగా ప్రొఫెసర్ జయశంకర్, శ్రీకాంత్‌చారికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, లేబర్ ఆఫీసర్ రఫీ, విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల వేణుగోపాలచారి, కోనరావుపేట ఎంపీటీసీ నర్సింహచారి, వోపా అధ్యక్షుడు తిప్పర్తి రమేశ్, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం మండలాధ్యక్షుడు రవీందర్, విశ్వకర్మ కార్పెంటర్స్ వెల్ఫేర్ సొసైటీ కోశాధికారి రుద్రోజు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మల్లేశం, నవీన్, రమేశ్, కాంబోజు ముత్యం, పుండరీకం, బ్రహ్మచారి, కమలాకర్, రంజిత్, భాస్కర్, భార్గవ్, సదా నందం, సత్యం, రాజశేఖర్‌శాస్త్రీ, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యానికి కుట్ర



మాట్లాడుతున్న నర్సయ్య

సిరిసిల్లటౌన్: పేదలకు సబ్సిడీపై అందజేస్తున్న రాయితీలను ఎత్తివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య కోరారు. సీఐటీయూ ఆఫీస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రం ఒక్కొక్కరికి అందజేసే ఆరు కిలోల బియ్యాన్ని ఐదు కిలోలకు తగ్గించి ఇవ్వడం సరికాదన్నారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం 14 రకాల ఆహార పదార్థాలను పంపిణీ చేయాలని కోరారు. మున్సిపల్‌లో విలీనమైన గ్రామాల్లో ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిలక బాబు, రవి, శ్రీనివాస్, రాజు ఉన్నారు.

జల్సాల కోసమే దొంగతనాలు

- ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్టు
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): జల్సాల కోసం చైన్‌స్నాచింగ్‌లు, చోరీలు చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం తుర్కాసినగర్‌కు చెందిన షేక్ వలీ, మరో బాలుడు మంచి స్నేహితులు. ఇద్దరూ జల్సాలకు అలవాటు పడ్డారు. కష్టపడి పనిచేయడం ఇష్టం లేక.. సులభంగా డబ్బు సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈక్రమంలో చైన్‌స్నాచింగ్‌పై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో ఈ నెల12న పల్సర్ బైక్‌పై మొగిలిపేటలోని కిరాణానికి వెళ్తున్న వృద్ధురాలిపై దాడిచేసి ఆమె మెడలోంచి బంగారు పుస్తెలతాడు తెంచుకు వెళ్లారు. అదేరోజు జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలోనూ చైన్ స్నాచింగ్ చేశారు. వీరిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసుల బృందం రంగంలోకి దిగింది. ఈ క్రమంలో బుధవారం కొత్తదాంరాజుపల్లిలో అపరిచితులు పల్సర్ బైక్‌పై తిరుగుతున్నారనే సమాచారంతో ఎస్సై నవీన్‌కుమార్, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. షేక్ వలీతోపాటు బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ జరపగా చోరీలు, చైన్‌స్నాచింగ్ వివరాలు వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బంది చేసిన కృషిని డీఎస్పీ అభినందించారు. వీరికి రివార్డులు అందించేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. నిందితుల నుంచి 12 గ్రాముల బంగారం, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

హ్యాట్రిక్ ఖాయం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



ఖమ్మం సభకు తరలిన నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నేపథ్యంలో మొదటిసారి ఖమ్మంలో నిర్వహించిన బహిరంగసభకు అశేష ప్రజానీకం తరలివచ్చి మద్దతు తెలిపారని, ఈ ఏడాదిలో వచ్చే ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించి మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ధీమా వ్యక్తం చేశారు. ఆగయ్య ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని వివిధ మండలాల నుంచి పెద్ద ఎత్తున ఖమ్మం బహిరంగ సభకు తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీగా అవతరించిన కొద్ది రోజుల్లోనే దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తుందన్నారు. కంటివెలుగుతో ఎంతో మంది పేదలకు కంటిచూపునిచ్చే గొప్ప కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోతున్నట్లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, నాయకులు రాఘవరెడ్డి, దేవయ్య, సుభాశ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఖమ్మంకు తరలిన బీఆర్ఎస్ జిల్లా నేతలు

సిరిసిల్ల: ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభకు జిల్లా నుంచి ఆ పార్టీ ముఖ్యనాయకులు తరలివెళ్లారు. బుధవారం ఉదయమే వాహనాల్లో ఖమ్మంకు తరలిపోయారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిల్లా నాయకులు పలువురు ఖమ్మం వెళ్లి పార్టీ బహిరంగ సభలో భాగస్వాములయ్యారు. సభా వేదిక వద్ద మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని కలిసి ముచ్చటించారు.

ఇల్లు లేని నిరుపేదలకు రూ.5లక్షలు ఇవ్వాలి

వీర్నపల్లి(వేములవాడ): ఇల్లు లేని నిరుపేదలకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. వీర్నపల్లిలో బుధవారం సీపీఐ సభ్యత్వకార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ మండలంలో ఇల్లు లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారన్నారు. పోడుభూముల సమస్య, వెంకటరాయిని చెరువు సమస్యలకు పరిష్కారాలు చూపాలని కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య, గజ్జల ప్రభాకర్, రాజేశం, రాజం, కృష్ణ, పర్శయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసభ్యకర పోస్టులు పెట్టిన యువకునిపై కేసు

చందుర్తి(వేములవాడ): వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబుపై ఫేస్‌బుక్‌లో అసభ్యకర పోస్టు పెట్టిన చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన మెకిలే విజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఇటీవల జరిగిన సెస్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేను కించపర్చేలా వీడియోను అప్‌లోడ్ చేశాడని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- ఎంపీపీ వెంకటరమణారెడ్డి
- ఇల్లంతకుంట సర్వసభ్య సమావేశం
- 'డబుల్' ఇళ్లు కేటాయించాలని రేపాక ఎంపీటీసీ నిరసన



బైటాయించిన ఎంపీటీసీ సుమలత

ఇల్లంతకుంట(మానకొండూరు): ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తున్నామని, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ వెంకటరమణారెడ్డి కోరారు. ఇల్లంతకుంట మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ రాబోయేది వేసవికాలం కాబట్టి మండలంలోని అన్ని గ్రామాల్లో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పనిచేస్తుందన్నారు. గ్రామాల్లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సహకారంతో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణాలు చేయిస్తామన్నారు. రేపాకలో అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని ఎంపీటీసీ కథ సుమలత నేలపై కూర్చుని నిరసన తెలిపారు. ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, డీఈ త్రినాథ్ పాల్గొన్నారు.

మహాశివరాత్రికి మెరుగైన ఏర్పాట్లు

- కలెక్టర్ అనురాగ్ జయంతి



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: వేములవాడలో ఫిబ్రవరి 17 నుంచి 19వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం రాత్రి అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని, గతంలో కంటే మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. పారిశుద్ధ్యం ప్రభావంతంగా ఉండాలని, భక్తులకు ఆధునిక యాప్‌లను అందుబాటులోకి తెచ్చి సమగ్ర సమాచారాన్ని చేరవేయాలన్నారు. మంచినీటి వసతి, రోడ్లు, పార్కింగ్, రవాణా, టాయిలెట్ల వసతులను కల్పించాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోరారు. రోడ్డు మార్గాలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రగతిలో ఉన్న పనులు పూర్తిచేయాలని, 'మన ఊరు–మన బడి' పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, నీటిపారుదల ఈఈ అమరేందర్‌రెడ్డి, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, ప్రజారోగ్యశాఖ ఈఈ సంపత్, ఆలయ ఈఈ రాజేశ్, టీపీవో అన్సారీ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ న్యాయవాద విద్యార్థి మృతి



సాగర్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగుండారం గ్రామానికి చెందిన జజ్జరి సాగర్(28) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈసంఘటన స్వగ్రామంలో విషాదం నింపింది. గుండారం గ్రామానికి చెందిన జజ్జరి ప్రకాశ్-ఎల్లవ్వల కొడుకు సాగర్ హైదరాబాద్‌లో న్యాయవాద విద్యనభ్యసిస్తున్నాడు. పరీక్షలు రాసి ఇంటికొచ్చిన సాగర్ ఈనెల12న ఫలితాలు వెలువడటంతో తిరిగి హైదరాబాద్ వెళ్లాడు. అక్కడే రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ సాగర్ ఉస్మానియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించుకుని ఇంటికొచ్చాడు. ఈనెల16న కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం రాత్రి శస్త్రచికిత్స చేస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. ఒక్కగానొక్క కొడుకు మృతితో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. మృతునికి తల్లిదండ్రులు ప్రకాష్, ఎల్లవ్వ, ఇద్దరు సోదరులున్నారు.

వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తించాడంటూ ఆందోళన

- పోలీసుల జోక్యంతో శాంతించిన మహిళ
- విచారణ చేపట్టిన పోలీసులు

చందుర్తి(వేములవాడ): వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వృద్ధునిపై చర్య తీసుకోవాలని కోరుతూ మండలంలోని బండపల్లి గ్రామపంచాయతీ ఆఫీస్ ఎదుట బాధిత మహిళతోపాటు ఆ కులసంఘం సభ్యులు బుధవారం ఆందోళనకు దిగారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. బండపల్లికి చెందిన వివాహిత(40)ను అదే గ్రామానికి చెందిన వృద్ధుడు(70) అసభ్యంగా ప్రవరించాడని మంగళవారం సాయంత్రం చితకబాదినట్లు తెలిసింది. ఈ విషయంపై బుధవారం బాధిత మహిళ కులసంఘం సభ్యుల సహకారంతో గ్రామపంచాయతీకి చేరుకుంది. సదరు వృద్ధున్ని గ్రామపంచాయతీ ఆఫీస్‌కు పిలిపించాలని పట్టుబట్టారు. రాత్రి జరిగిన దాడిలో తీవ్రంగా దెబ్బలు తగిలాయని వృద్ధుని భార్య తెలపడంతో.. వృద్ధునిపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత మహిళ పెట్రోల్ డబ్బాతో ఆందోళనకు దిగింది. ఈ విషయం తెలుసుకున్న చందుర్తి పోలీసులు అక్కడికి చేరుకొని మహిళ చేతిలోని డబ్బాను లాక్కున్నారు. రోడ్డుపై ధర్నాకు దిగితే కేసు పెడతామని హెచ్చరించడంతో ఆందోళన విరమించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై చందుర్తి ఎస్సై రమేశ్‌ను వివరణ కోరగా వృద్ధునిపై దాడి చేశారని ఫిర్యాదు వచ్చిందన్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని ఎస్సై వివరించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు



కారు ఢీకొనడంతో ఊడిపోయిన బస్సు చక్రాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



నుజ్జునుజ్జయిన కారు

- ఊడిన బస్సు చక్రాలు
- ఆరుగురికి స్వల్ప గాయాలు

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలంలోని వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారి నాగాయపల్లి–పోచెట్టిపల్లి గ్రామాల మధ్య బుధవారం జరిగిన కారు, బస్సు ప్రమాదంలో ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటనలో బస్సు వెనుకచక్రాలు ఊడిపోయాయి. కారు బెలూన్స్ తెరుచుకోవడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ గోచారం అశోక్ తెలిపిన వివరాలు. ఆర్మూర్ డిపోకు చెందిన బస్సు వేములవాడకు వచ్చి తిరిగి వెళ్తుండగా నాగాయపల్లి–పోచెట్టిపల్లి గ్రామాల మధ్య ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా బస్సును ఢీకొట్టింది. ఈ సంఘటనలో బస్సు వెనుక చక్రాలు విడిపోయాయి. కారులో ప్రయాణిస్తున్న సింగిరెడ్డి మహిపాల్‌రెడ్డి, అతని భార్య అశ్విని, కూతురు హయతి, కుమారుడు హ యాన్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. కారు బెలూన్‌లు తెరుచుకోవడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. కరీంనగర్ జిల్లా సదాశివపురం గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి కుటుంబం సంక్రాంతి పండుగ కోసం అత్తగారి ఊరు కథలాపూర్ మండలం కలికోటకు వచ్చారు. హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బస్సులో ప్రయాణిస్తున్న బోనాల అజయ్, శివలకు స్వల్ప గాయాలయ్యాయి. కారు నుజ్జునుజ్జు అయ్యింది. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్సై నాగరాజు వెంటనే తన సిబ్బందిని తరలించి బాధితులను ఆసుపత్రికి తరలించారు. అటుగా వస్తున్న చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ ప్రమాద బాధితులను తన కారులోనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వేములవాడ డిపో మేనేజర్ భీంరెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి వాహనాన్ని రోడ్డు నుంచి పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.